సాక్షి హనుమకొండ

శనివారం | 4 | జనవరి | 2025



శ్రీహరి పొద్దుతిరుగుడు పువ్వు

రాష్ట్ర రాజకీయాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పొద్దుతిరుగుడు పువ్వులా మారిపోయాడని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. - 10లో▸



చిన్న కాళేశ్వరం మోటార్లకు టెస్ట్ రన్ - 10లో▸

చిన్న కాళేశ్వరం మోటార్ల టెస్ట్ రన్‌ను ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $29^0/14^0$

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'చెకుముకి' విజేతలకు కలెక్టర్ అభినందన



హన్మకొండ అర్బన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలను కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం అభినందించారు. డీపీఎస్, హనుమకొండ (మొదటి స్థానం), టీజీఎస్‌డీడబ్ల్యూ, మడికొండ (ఐదో స్థానం), జెడ్పీహెచ్‌ఎస్, పీచర (ఆరో స్థానం) విజేతలుగా నిలిచిన విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, సామాజిక సంస్కరణలు, మానవ విలువలను అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సీబీ రామారావు, డాక్టర్ రాములు, ఉమామహేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తుల హార్డ్‌కాపీలు అందజేయాలి

కాజీపేట అర్బన్: బీసీ వెల్ఫేర్ పరిధి ప్రైవేట్, ప్రభుత్వ ఇంజనీరింగ్, నర్సింగ్, డిగ్రీ, ఇంటర్ కళాశాల విద్యార్థులు 2017–18 నుంచి 2024–25 వరకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుల హార్డ్ కాపీలు అందజేయాలని బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ జిల్లా అధికారి ఎస్.లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోపు హనుమకొండ కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పోలీసులు ఉత్సాహంగా విధులు నిర్వర్తించాలి



మడికొండ: విధి నిర్వహణలో పోలీసులు ఎప్పుడూ ఉత్సాహంగా ఉండాలని అదనపు డీసీపీ రవి పోలీసు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మడికొండ శివారులోని సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో రెండ్రోజుల శిక్షణ తరగతులను శుక్రవారం అదనపు డీసీపీ రవి ప్రారంభించారు. శిక్షణలో భాగంగా సిబ్బంది శారీరక వ్యాయామంతో పాటు నేరాల నియంత్రణ,పై పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. చట్టాలపై అవగాహన, శాంతి భద్రతల పరిరక్షణ, నిర్వహించాల్సిన విధులపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీటీ పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మంగీలాల్, ఆర్ఐ ఉదయ్‌భాస్కర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మెప్మా' ఆర్పీలకు గౌరవ వేతనాలు

వరంగల్ అర్బన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పని చేస్తున్న ఆర్పీల గౌరవ వేతనాలు మంజూరవుతున్నాయి. రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి ఆదేశాల మేరకు వేతనాల సర్దుబాటు చెల్లింపులు చేపట్టాలని సూచించారు. గత 7 నెలలుగా వేతనాలు లేక ఆర్పీలు తీవ్ర ఇబ్బందులకు గురై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆర్పీల వేతన బకాయిలను చెల్లించాలని సూచించారు. తదుపరి ఆసొమ్మును మంజూరు చేసి సర్దుబాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో గత వారం రోజుల కిందట నగరంలోని 505 ఆర్పీలకు ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున రూ.60.3 లక్షలు చెల్లించారు. మరో ఐదు నెలల వేతనం రూ.1.51 కోట్లు చెల్లించేందుకు ఫైల్ సిద్ధం చేశారు. వారం రోజుల్లోగా వీరీ ఖాతాల్లో బకాయిలు జమకానున్నాయి. జూన్ నుంచి వేతనాల కోసం ఎదురు చూసిన ఆర్పీలకు ఉపశమనం కలిగింది.

క్రమశిక్షణతో పనిచేయాలి



మామునూరు: పీటీసీ పోలీసులు క్రమశిక్షణతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ సూచించారు. శుక్రవారం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్‌ను కట్ చేసి సిబ్బందికి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. డీఎస్పీ రమేష్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, పాండు నాయక్, భిక్షపతి, కల్పనరెడ్డి, డాక్టర్ సుధీర్, ఆర్ఐ చంద్రశేఖర్, మహేష్, నవీన్, కాశీరామ్, నరేష్, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.



పీహెచ్‌సీల్లో మందులేవి?

సీడీఎస్‌ల నుంచి సరఫరా కాని మెడిసిన్

- ఇండెంట్లు ఇచ్చినా స్పందించని అధికారులు
- తపాలాశాఖ పెత్తనంతో అస్తవ్యస్తం
- మందుల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగిపోతున్న ప్రజలు..
- అసహనంతో వైద్య సిబ్బందిని నిలదీస్తున్న వైనం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

- పరకాల డివిజన్‌లోని ఓ హెల్త్ సబ్ సెంటర్‌లో రెండు రోజులుగా మందుల కొరత ఏర్పడింది. జ్వరం, జలుబు, గొంతునొప్పితో బాధ పడుతున్న పలువురు ఆ సబ్‌సెంటర్ చుట్టూ తిరిగి పోతున్నారు. హెల్త్‌అసిస్టెంట్, ఏఎన్‌ఎంలను కలిస్తే.. మందుల కోసం మెడికల్ ఆఫీసర్ ఇండెంట్ పెట్టారని, వస్తాయని చెబుతున్నారని బాధితులు చెప్పారు.

- హనుమకొండ క్లస్టర్ పరిధి ధర్మసాగర్ ఏరియాలోని ఓ సబ్‌సెంటర్ చుట్టూ వృద్ధులు తిరిగి పోతున్నారు. ఇక్కడ కూడా సంబంధిత పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మూడు రోజుల కిందటే ఇండెంట్ పంపారని, రెండు రోజుల్లో వస్తాయని వైద్య ఆరోగ్యసిబ్బంది చెబుతున్నారు.

... ఇలా హనుమకొండ జిల్లాతోపాటు ఉమ్మడి వరంగల్‌లోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లు, ఉప కేంద్రా (సబ్‌సెంటర్)ల్లో వారం రోజులుగా మందుల కొరత వేధిస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి తదితర సమస్యలు వస్తే ఆర్‌ఎంపీలు, వాళ్లిచ్చే మందులపై ఆధారపడాల్సి వస్తుందని అంటున్నారు. నిధుల కొరత పేరిట ప్రభుత్వం మందుల సరఫరా బాధ్యతలను తపాల శాఖకు అప్పగించడం వల్ల.. సకాలంలో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లకు మందులు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చెప్పడం గమనార్హం. మందులు

ఏడాది కిందట తపాలాశాఖకు బాధ్యత...

ప్రజలకు ఔషధాలు అందుబాటులో ఉంచేందుకు స్టేట్ డ్రగ్ స్టోర్స్ నుంచి డిస్ట్రిక్ట్ సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీఎస్)లకు ప్రభుత్వం సకాలంలోనే సరఫరా చేస్తున్నది. హనుమకొండ జిల్లా డ్రగ్ స్టోర్ నుంచి పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లకు సకాలంలో అందడం లేదు. కారణాలపై ఆరా తీస్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఈ మందుల సరఫరాను ఏడాది కింద కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ తపాలా శాఖకు అప్పజెప్పింది. పీహెచ్‌సీలు, కమ్యూనిటీ, అర్బన్‌హెల్త్ సెంటర్లు, సబ్‌సెంటర్లు, ఇతర ప్రభుత్వ ఆస్పత్రులు ఆన్‌లైన్‌లో వారి అవసరం మేరకు ఇండెంట్ పెడతారు. ఆర్డర్ ప్రకారం సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ వారు రవాణా చేయాల్సి ఉంది. గత సంవత్సరంనుంచి తపాలశాఖ ఈ విధులు నిర్వర్తిస్తుండగా.. సకాలంలో సరఫరా చేయక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు మందులు తీసుకెళ్లేందుకు వైద్యాధికారులే వాహనాలను సమకూర్చుకోవాలంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు మందులు కోసం వచ్చిన ప్రజలు.. ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు దుర్భాషలాడుతున్నారు. దీంతో వైద్యాధికారులు తప్పనిసరి పరిస్థితిల్లో సొంత డబ్బులు పెట్టుకొని కిరాయి వాహనాలను మాట్లాడుకొని తీసుకెళ్తుండగా.. ఆ రవాణాకు సంబంధించిన ఇంధనం బిల్లులను కూడా తపాలశాఖ, సీడీఎస్ అధికారులే కాజేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉద్యోగసంఘాల నాయకులు కోరుతున్నారు.

జిల్లా వివరాలు...

మొత్తం కుటుంబాలు	2,30,451
మొత్తం జనాభా	9,08,744
పురుషులు	4,55,343
మహిళలు	4,53,401
గ్రామీణ జనాభా	4,98,618 (54.87 శాతం)
పట్టణ /నగర జనాభా	4,10,126 (45.13 శాతం)
పిల్లల జనాభా	(0-6): 81,834
పీహెచ్‌సీల సంఖ్య	17
హెల్త్ సబ్ సెంటర్లు	106
అర్బన్ హెల్త్ సెంటర్లు	07
ఇతర ఆసుపత్రులు	06



పెద్ద మనుషులు తిట్టారని..

- మహిళ ఆత్మహత్యాయత్నం
- ఆరుగురు కుల పెద్దలపై కేసు

ఐనవోలు: పెద్ద మనుషులు తిట్టారని మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన బినబోయిన అనిత శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదవ కులానికి చెందిన నాయిని చిన్న కొమురయ్యకు కొండపర్తిలో సుమారు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. చిన్న కొమురయ్యకు కొడుకులు లేక పోవడంతో కుమార్తె, అల్లుడు బినబోయిన అనిత–ఐలయ్య ఇల్లరికం ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం చిన్న కొమురయ్య వ్యవసాయ భూమి పక్క నుంచి కెనాల్ కాలువ పోయింది. దీంతో ఆయనకు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడానికి బాట సమస్య ఏర్పడింది. పెద్ద మనుషుల ద్వారా తన ముందున్న రైతుతో మాట్లాడుకుని గుంట భూమికి బదులు మూడు గుంటల భూమి ఇచ్చేలా ఒప్పందం చేసుకుని బాట సమస్యను పరిష్కరించుకున్నాడు. ఈక్రమంలో మరో రైతు బినబోయిన రమేశ్ కూడా బాట కోసం సదరు పెద్ద మనుషులను సంప్రదించాడు. ఆపెద్ద మనుషులు గతంలో చిన్నకొమురయ్యకు చేసిన తీర్మానానికి భిన్నంగా గుంట భూమికి గుంట భూమి ఇచ్చేలా తీర్మానం చేశారు. ఈతీర్మానం నచ్చకపోవడంతో చిన్న కొమురయ్య ఒప్పుకోలేదు. దీంతో కుల పెద్దలు అతడిని కులం నుంచి బహిష్కరించారు. ఈక్రమంలో బాట హద్దులు ఏర్పాటు చేయడానికి గురువారం పెద్ద మనుషులు చిన్న కొమురయ్య వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి హద్దులు ఏర్పాటు చేస్తున్న క్రమంలో చిన్న కొమురయ్య కుమార్తె బినబోయిన అనిత.. పెద్ద మనుషులు అన్యాయం చేస్తున్నారని, వారి తీరుపై అభ్యంతరం తెలిపింది. దీంతో కుల పెద్ద మనుషులు ఆమెను దూషించగా.. తీవ్ర మనస్తాపంతో పక్కనే వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కాగా.. హుటాహుటిన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీంతో చిన్నకొంరయ్య తన కూతురు ఆత్మహత్య చేసుకోవడానికి కుల పెద్దమనుషులే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా.. నాయిని పెద్ద ఐలయ్య, నాయిని దశరథం, బైకని సాయిలు, కొడాలి భిక్షపతి, నాయిని కనక సేన, బైకాని పెద్ద రాజుతో పాటు బినబోయిన రమేశ్‌పై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

చదువుతో ఉన్నత శిఖరాలకు

- మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు
- కెనరా రోబోకో ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న మాజీ మంత్రి గుండె విజయరామారావు

వేలేరు: విద్యార్థులు చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. శుక్రవారం రోబోకో ఫౌండేషన్ వారి సహకారంతో మండలంలోని పీచర, మల్లికుదుర్ల, వేలేరు, ధర్మసాగర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 6,7,8,9 తరగతులు చదువుతున్న 342 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. గొప్ప స్థాయికి చేరుకున్న వారిని ఆదర్శంగా తీసుకుని విజయతీరాలకు చేరుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థికి పట్టుదల క్రమశిక్షణ ఉండాలని, గతంలో తమలాంటి వారికి ఎలాంటి సౌకర్యాలు లేకున్నా కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చామని, ఇప్పుడున్న పిల్లలకు అన్ని సౌకర్యాలున్నాయని.. వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రఘు, మమత, మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, వేలేరు, చిల్పూరు మండలాల అధ్యక్షులు కాట్రేవుల రాజు, గంటే ఉపేందర్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు కీర్తి సురేశ్, కిరణ్, లింగం, దామోదర్ రెడ్డి, రమేశ్, శివాజీ పాల్గొన్నారు.

ఆదర్శం.. సావిత్రిబాయి పూలే జీవితం



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి, అధికారులు, నాయకులు

- కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: సావిత్రిబాయి పూలే జీవితాన్ని మహిళా ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని సమాజంలో బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐదుగురు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీఆర్ఓ వైవీ గణేశ్, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, తదితరులు పాల్గొన్నారు.

'పది'కి ప్రత్యేక ప్రణాళిక

- హెచ్‌ఎంలకు 40 రోజుల ప్లాన్ అందజేత
- జిల్లాలో మొదలైన స్పెషల్ క్లాస్‌లు
- రోజుకో స్లిప్ టెస్ట్
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లాలో 12,006 మంది టెన్త్ విద్యార్థులు

విద్యారణ్యపురి: ఈఏడాది మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. హనుమకొండ జిల్లాలో ఏ పాఠశాలలో సిలబస్ పూర్తి కాలేదో అక్కడ పూర్తి చేయాలని హెచ్‌ఎంలను సంబంధిత విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఇటీవల జిల్లా స్థాయిలో హెచ్‌ఎంల సమావేశాన్ని నిర్వహించి వారికి 40 రోజుల ప్రత్యేక కార్యాచరణను అందజేశారు. హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి ఈ విద్యా సంవత్సరంలో 12,006 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ యాజమాన్యాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డీఈఓ ఆదేశించారు. ఆదిశగా పాఠశాలల్లో కార్యాచరణ మొదలైంది.

ప్రతీ పాఠశాలకు బుక్‌లెట్..

జిల్లాలోని వివిధ స్థాయిల్లో విద్యార్థుల స్థితిగతులను ఆధారం చేసుకుని నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ప్రతీ సబ్జెక్టుకు రోజువారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాల పట్టికను (బుక్‌లెట్) రూపొందించారు. సబ్జెక్టుపరంగా ఏయే కాన్సెప్టులపై అత్యధిక శ్రద్ధ పెట్టాలి? అనే అంశాలను క్రోడీకరిస్తూ, సబ్జెక్టు వారీగా అంశాలను నిర్ధారించారు. దీనికి సంబంధించి ప్రతీ పాఠశాలకు ఒక హార్డ్ కాపీని (బుక్‌లెట్) అందించారు.

వందశాతం ఫలితాల సాధనే లక్ష్యం



జిల్లాలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. గతేడాది అన్ని యాజమాన్యాల పదో తరగతి విద్యార్థులు 96.04 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 9వ స్థానంలో నిలిచింది. ఈసారి వందశాతం ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం.

– వాసంతి, డీఈఓ, హనుమకొండ

ప్రత్యేక బోధన..



జిల్లాలో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతీ సబ్జెక్టు ఉపాధ్యాయుడికి అవసరమైన అకాడమీ సపోర్ట్ ఇచ్చేందుకు రిసోర్స్ గ్రూపును ఏర్పాటు చేశాం. ఉపాధ్యాయులు మాదిరి జవాబుపత్రాలు తయారుచేసి విద్యార్థులకు సూచిస్తే విద్యార్థులు సక్సెస్‌ఫుల్‌గా క్వశ్చన్స్‌కు ఆన్సర్లను అటెంప్ట్ చేస్తారు. ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారు.

– ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్, హనుమకొండ



ఎల్కతుర్తి జెడ్పీ హెచ్‌ఎస్‌లో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

షెడ్యూల్ ఇదీ..

- జనవరి 2 నుంచి మార్చి 20 వరకు ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తారు.
- స్పెషల్ క్లాస్‌లు, నిత్యం స్లిప్‌టెస్ట్‌లు, ప్రత్యేక పరీక్షలు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు హెచ్‌ఎంలు పర్యవేక్షిస్తారు.
- ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.
- ప్రస్తుతం చలికాలం నేపథ్యంలో సాయంత్రం పాఠశాల ముగిశాక గంట పాటు రోజుకో సబ్జెక్టు టీచర్ విద్యాబోధన చేస్తారు.
- సంక్రాంతి తర్వాత ఉదయం గంట, సాయంత్రం గంట విద్యాబోధన ఉంటుంది.
- 15 రోజులకోసారి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు చేరవేస్తారు.
- సబ్జెక్ట్ టీచర్లు విద్యార్థులను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ఉదయం వేక్ అప్ కాల్స్, రాత్రి గుడ్‌నైట్ కాల్స్ చేయాల్సి ఉంటుంది. (అనేకమంది టీచర్లు చేస్తున్నారు)
- కేజీబీవీల్లో టీచర్లు సమ్మె చేస్తుండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు విద్యాశాఖ అధికారులు ఉపక్రమించారు.
- ప్రైవేట్ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు సిలబస్ పూర్తయ్యింది. రివిజన్ ప్రారంభించారు.

జీడబ్ల్యూఎంసీలో టెండ'రింగ్'

- సిండికేట్ సభ్యులకు పనుల పంపిణీ
- 'బాస్' ఆదేశాలు అతిక్రమిస్తే కటకటాలే
- మితిమీరిన బడా కాంట్రాక్టర్ల వ్యవహారం



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌లో ఐదేళ్ల తర్వాత మళ్లీ సిండికేట్ వ్యవహారానికి ఆధిపత్యం నడుస్తోంది. 'ఆన్‌లైన్' టెండర్ ప్రక్రియ ఉన్నప్పటికీ కూటమి(రింగ్) దందా ఆగడం లేదు. ఇంజినీర్లు తయారు చేసిన అంచనా, వ్యయమే కాదు దాన్ని మించి కూడా దోచుకునేందుకు బడా కాంట్రాక్టర్లు వ్యూహాలు పన్నుతున్నారు. ఇందుకు తాజాగా బల్దియాలో సుమారు రూ.20 కోట్లతో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్), జనరల్ ఫండ్‌తో 80 సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. సిండికేట్‌కు నేతృత్వం వహిస్తున్న బడా కాంట్రాక్టర్ 'బాస్' ఆదేశాలు లేనిదే టెండర్ వేయకూడదని హుకుం జారీ చేశారు. ఈ పనులకు 15 మంది కాంట్రాక్టర్లు సిండికేట్ వ్యవహారాన్ని వ్యతిరేకించి టెండర్లు దాఖలు చేశారు. దీంతో ఓ బడా కాంట్రాక్టర్ ఎంట్రీ ఇచ్చి, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చిన్న కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్నికల్ బెడ్ తెరిచేలోగా ఇంజినీర్లకు లేఖలు అందజేసి తప్పుకోవాలని లేదంటే పరిణామాలు మరోలా ఉంటాయని హెచ్చరికలు చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. 'నా ఇష్టం' అన్న ఓ చిన్న కాంట్రాక్టర్‌ను ఓపోలీస్ స్టేషన్‌లో అప్పగించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. పోలీసులు మాత్రం తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని దాట వేస్తుండడం గమనార్హం. నెల రోజుల కిందట జరిగిన అభివృద్ధి పనుల్లో ఇదే తరహాలో పనులన్నీ కొంత మంది కాంట్రాక్టర్లు దక్కించుకుంటున్నారని, ప్రజాప్రతినిధుల ఆశీస్సులూ పుష్కలంగా ఉన్నాయంటున్నారు. అంతేకాకుండా ఇంజినీర్లు తమ సహకారం అందిస్తున్నారని వాపోతున్నారు.

అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కాశోజీ సెంటర్: జిల్లాలో 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌టీ, నర్సింగ్ పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనంలో ఉన్న డీఐఈఓ కార్యాలయంలో ఈనెల 8వ రకు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

తిలకిస్తున్న, ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, కమాండెంట్ రాంప్రకాశ్





బైక్‌పై విన్యాసం

పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహిస్తున్న శిక్షణ కానిస్టేబుళ్లు



శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి

మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో శుక్రవారం ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 453 మంది స్పెషల్ కానిస్టేబుళ్ల దీక్షాంత్ (పాసింగ్ అవుట్) పరేడ్ ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథిగా ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి హాజరయ్యారు. ప్రత్యేక వాహనంపైనుంచి స్పెషల్ కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు మార్షల్‌ఆర్ట్స్ ప్రదర్శించారు. అనంతరం తరుణ్‌జోషి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని ఆకాంక్షించారు. – ఖిలా వరంగల్

- వివరాలు 10లో▸

క్లుప్తంగా

ఓసీ -3 ప్రాజెక్టులో రోడ్డు ప్రమాదం

- డ్రైవర్ అన్వర్‌కు తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం


క్యాబిన్‌లో ఇరుక్కు పోయిన అన్వర్‌పాషా

గణపురం: భూపాలపల్లి జిల్లా గణపురం మండలం మాధవరావుపల్లి ఓసీ -3 ప్రాజెక్టులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వోల్వో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ప్రాజెక్టులో బొగ్గును తరలిస్తున్న క్రమంలో మంచు కురుస్తుండడంతో ర్యాంప్‌పై నిలిపిన వాహనాన్ని మరో వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. దాంతో ఈ ప్రమాదంలో గణపురం మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ అన్వర్ పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో గమనించిన తోటి డ్రైవర్లు, సిబ్బంది వెంటనే భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, అతడి కాలును పూర్తిగా తొలగించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

పత్తి కట్టెను కలియదున్నాలి

- వాటిని కాల్చితే కాలుష్యం
- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న


సింగారంలో పత్తి పంటను యంత్రం ద్వారా ముక్కలుగా కట్‌చేసి దున్నే విధానాన్ని పరిశీలిస్తున్న రాజన్న, తదితరులు

మామునూరు: పత్తి కట్టెను యంత్రంతో ముక్కలుగా చేసి భూమిలోనే కలియ దున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా కూడా ఉపయోగపడుతుందని వరంగల్ మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న సూచించారు. ఈమేరకు వరంగల్ బొల్లికుంట, మామునూరు, సింగారం గ్రామాల్లో కేవీకే శాస్త్రవేత్తలు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎండిపోయిన పత్తి పంటలను పరిశీలించి మాట్లాడారు. రూ.లక్ష యాభై వేలకు కాటన్ షెడ్డర్ యంత్రం మార్కెట్లో లభిస్తుందని చెప్పారు. దానితో గంటన్నరలో ఎకరం విస్తీర్ణంలోని పత్తి కర్రను ముక్కలుగా చేసి కలియ దున్నవచ్చని చెప్పారు. పత్తి కర్రలను కాల్చడం వల్ల కాలుష్యం పెరిగి భూమి దెబ్బతింటుందని హెచ్చరించారు. అలాగే, పత్తి కర్ర తీయకపోవడం వల్ల వచ్చే అనర్థాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, రాజు, హర్షరెడ్డి, సాయిచంద్, సుశృత్, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి

దేశ సేవలో స్పెషల్ పోలీసులు ముందుండాలి | **సమాజాన్ని తీర్చిదిద్దడంలో పోలీసుల పాత్ర కీలకం**

- పాసింగ్ అవుట్ పరేడ్‌లో రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్, ఐజీ డాక్టర్ తరుణ్‌జోషి
- ఆకట్టుకున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్


మాట్లాడుతున్న తరుణ్‌జోషి


ప్రత్యేక వాహనంపై వెళ్తూ కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న తరుణ్‌జోషి

ఖిలా వరంగల్: శాంతిభద్రతల పర్యవేక్షణ బాధ్యత స్పెషల్ పోలీసులపై ఉందని రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్, ఐజీ డాక్టర్ తరుణ్‌జోషి గుర్తుచేశారు. సమాజాన్ని తీర్చిదిద్దడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో కమాండెంట్ బి.రాంప్రకాశ్ ఆధ్వర్యంలో ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 453 మంది స్పెషల్ కానిస్టేబుళ్ల దీక్షాంత్ (పాసింగ్ అవుట్) పరేడ్ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథిగా తరుణ్‌జోషి హాజరై పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, కమాండెంట్ రాంప్రకాశ్‌లతో కలిసి ప్రత్యేక వాహనంపై నుంచి స్పెషల్ కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను ఉద్దేశించి తరుణ్‌జోషి మాట్లాడారు. పోలీసు కుటుంబంలో చేరబోతున్న ప్రతీ కానిస్టేబుల్ ప్రజా సేవకుడిగా మారాలని సూచించారు. యూనిఫాంను గౌరవిస్తూ ప్రజల కష్టాలు, నష్టాలను అంచనా వేస్తూ వారి సేవలో ముందుండాలన్నారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ చట్ట ప్రకారం శిక్షించాలని పేర్కొన్నారు. నేరాలను అదుపు చేయడంలో అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కింది స్థాయి నుంచి అత్యున్నత స్థాయి వరకు ఏ ఒక్కరూ తప్పు చేసినా పోలీసు శాఖపై మచ్చ పడుతుందని తెలిపారు. క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధతతో విధులు నిర్వర్తించే వారికి పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వివరించారు. లక్ష్యసాధన కోసం 9నెలల పాటు కఠోర శిక్షణను ఇష్టంగా పూర్తిచేసి వందశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో పరేడ్ వ్యాఖ్యాత, ఫార్మసిస్ట్ జలగం రమేష్‌కుమార్, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్, ఏసీలు శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్‌ఐలు శోభన్, రవి, వెంకటేశ్వర్లు, సర్వర్, పురుషోత్తం రెడ్డి, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


భార్య, పిల్లలతో కానిస్టేబుల్

మెరుగైన సేవలందించాలి

కానిస్టేబుళ్లు అధునాతన టెక్నాలజీని ఉపయోగించి దేశం గర్వించే విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ బి.రాంప్రకాశ్ సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశం విధి నిర్వహణలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తొమ్మిది నెలల పాటు ఇండోర్, అవుట్ డోర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులను శిక్షణార్థులు విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు.


తల్లిదండ్రుల కాళ్లు మొక్కుతున్న కానిస్టేబుల్

శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల మనోగతం

మా నాన్నే నాకు ఆదర్శం



మా నాన్న హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తుంటాడు. మా తల్లిదండ్రులు కష్టపడి నన్ను చదివించారు. మా నాన్నను ఆదర్శంగా తీసుకునే ఎలాగైనా జాబ్ సాధించాలనుకున్నాను. ఆయన ఆశయం నెరవేర్చినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది.

– పి.పాండు, రాయ్‌కోడ్, సంగారెడ్డి జిల్లా

నిబద్ధతతో పనిచేస్తా..



నాకు జాబ్ రావడంతో మా కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మాది వ్యవసాయ ఆధారిత కుటుంబం. మా తల్లిదండ్రుల కష్టాలు తీర్చడానికి కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాను. వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేయడమే నా లక్ష్యం.

– వై.శ్రీనివాస్, కల్వకుర్తి, నాగర్ కర్నూల్ జిల్లా

నా జీవితంలో మరువలేని ఘట్టం



టీజీఎస్పీ బెటాలియన్‌లో స్పెషల్ కానిస్టేబుల్‌గా శిక్షణ పొందడం నా జీవితంలో మరిచిపోలేని ఘట్టం. రైతు కుటుంబంలో పుట్టిన నేను.. నా కుటుంబ పోషణ కోసం ఎలాగైనా కానిస్టేబుల్ జాబ్ కొట్టాలనుకున్నాను. కష్టపడి సాధించి శిక్షణ పూర్తిచేశాను. ఇప్పుడు నా కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంగా ఉన్నారు.

– ఉదయ్‌కిరణ్, ఉట్కూర్, నారాయణపేట జిల్లా




మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో నిర్వహించిన దీక్షాంత్ పరేడ్‌లో కానిస్టేబుళ్ల విన్యాసాలు


కానిస్టేబుల్‌కు బహుమతి అందజేస్తున్న తరుణ్‌జోషి

ఎస్‌ఎస్‌ఈ రాజమౌళికి విశిష్టసేవా పురస్కార్


అవార్డు అందుకుంటున్న రాజమౌళి

కేసముద్రం: సికింద్రాబాద్ రైల్ కళారంగ్‌లో మహబూబాబాద్ సెక్షన్ సీనియర్ ఇంజనీర్ (ఎస్‌ఎస్‌ఈ) రాజమౌళికి విశిష్ట సేవా పురస్కార్ అవార్డు దక్కింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల కారణంగా మహబూబాబాద్ సెక్షన్‌లోని మహబూబాబాద్ – తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య, ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో 20చోట్ల రైల్వే ట్రాక్ కింద కంకర కొట్టుకుపోయిన సమయంలో సెక్షన్ సీనియర్ ఇంజనీర్ రాజమౌళి ముందస్తుగా పెట్రోల్ మెన్, బ్రిడ్జి వాచ్‌మెన్‌లను అప్రమత్తం చేసి ఎలాంటి ప్రమాదం జరగకుండా విధులు నిర్వహించారు. రైల్వేలోని ఇంజనీరింగ్ విభాగంలో రాజమౌళి చేసిన సేవలను గుర్తించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కార్ అవార్డును ఆయనకు శుక్రవారం అందజేశారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ హాకీ జట్టు


కేయూ హాకీ జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్: చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో ఈనెల 3న ప్రారంభమై 7వ తేదీ వరకు కొనసాగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ హాకీ పురుషుల జట్టు ఎంపికైందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. ఈ జట్టులో జి.ప్రవీణ్, బి.సింహాద్రి, బి.వరుణ్ తేజ్, బి.అఖిల్, జి.రాజు, ఎస్.రామకృష్ణ, జి.తేజ, పి.శ్రీకాంత్, ఎ.నగేష్, కె.రాజ్‌కుమార్, ఇ.వాసుదేవ్, ఎస్.చిరంజీవి, కె.జంగు, ఎస్.విజయ్‌కుమార్, ఎస్.గౌతమ్ రాజ్, పి.సందీప్, బి.గోపిచంద్, మహ్మద్ ఉస్మాన్ ఘనీఖాన్ ఉన్నారు. ఈ జట్టుకు వరంగల్‌లోని బొల్లికుంట వీసీపీఈ ఫిజికల్ డైరెక్టర్ సయ్యద్ యాసిన్, హనుమకొండ కాకతీయ ప్రభుత్వ, కనిష్క డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రాకేష్ కోచ్‌గా వ్యవహరించనున్నట్లు ప్రొఫెసర్ వెంకయ్య వివరించారు.

కడియం శ్రీహరి పొద్దు తిరుగుడు పువ్వు

- ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడికి వెళ్తాడు
- సిగ్గుంటే రాజీనామా చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: రాష్ట్ర రాజకీయాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పొద్దు తిరుగుడు పువ్వులా మారిపోయారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పల్లా మాట్లాడుతూ రంగులు మార్చే ఊసరవెల్లి కడియంకు గోరీ కడతామని హెచ్చరించారు. ఏపార్టీ అధికారంలో ఉంటే అందులోకి పదవి పిచ్చితో మారే శ్రీహరికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఏమాత్రం సిగ్గు, శరం ఉన్నా కేసీఆర్ పెట్టిన భిక్షతో ఎన్నికైన పదవికి వెంటనే రాజీనామా చేసి, తిరిగి పోటీ చేసి తన సత్తాను నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కేసీఆర్, కేటీఆర్, కవితను విమర్శించే స్థాయి కాదని ఘాటుగా విమర్శించారు. ఇష్టం వచ్చినట్లు అవాక్కులు, చెవాక్కులు పలికితే కర్రుకాల్చి వాత పెడతామని శ్రీహరిని పల్లా హెచ్చరించారు. తన వ్యక్తిగతంగా వైద్యం విషయంలో నీలిమ ఆస్పత్రి ద్వారా వందలాది మందికి ఉచితంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. 40 ఏళ్ల రాజకీయం అంటున్న కడియం శ్రీహరి.. ఘన్‌పూర్‌కు ఒక్క డిగ్రీ కళాశాల కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, నర్సింగరావు, మసిఉర్ రెహమాన్, గంగం సతీష్‌రెడ్డి, ముస్త్యాల దయాకర్, జూకంటి లక్ష్మీ శ్రీశైలం, పేర్ని స్వరూప, బోడిగం జయప్రకాష్‌రెడ్డి, ముసిని రాజు, వేముల విద్యాసాగర్ గౌడ్, దేవునూరి సతీష్, తదితరులు ఉన్నారు.

టీపీజేఎంఏ క్రీడా పోటీలు ప్రారంభం


వరదారెడ్డిని సన్మానిస్తున్న టీపీజేఎంఏ సభ్యులు

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీ మైదానంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీజేఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగనున్నాయి. టీపీజేఎంఏ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్, హనుమకొండ డీఐఈఓలు శ్రీధర్ సుమన్, గోపాల్ ముఖ్యఅతిథులుగా హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం చేకూరుతోందన్నారు. పోటీల వల్ల స్నేహభావం పెంపొందుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఎస్సార్ యూనివర్సిటీ చైర్మన్ ఎ.వరదారెడ్డిని టీపీజేఎంఏ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి, సంఘం సభ్యులు కుమార్, రాజు, అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు అస్వస్థత

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని వైరల్
- ఫుడ్ పాయిజన్ అంటున్న భర్త వెంకటాచారి


వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేత

బచ్చన్నపేట : సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన నల్లనాగుల శ్వేత శుక్రవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా శ్వేత కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుందంటూ ఉదయం పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఇందుకు కుటుంబ కలహాలే కారణమని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై చైర్ పర్సన్ శ్వేత భర్త వెంకటాచారి ఆస్పత్రినుంచి వీడియో పంపారు. తన భార్యకు ఫుడ్‌పాయిజన్ అయి తీవ్ర అస్వస్థతకు గురైందని, జనగామ ఆస్పత్రినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లామని పేర్కొన్నారు. తమపై అభూత కల్పనలతో దుష్ప్రచారాలు చేయడం తగదంటూ వేడుకున్నారు. త్వరలోనే శ్వేతతో మాట్లాడిస్తామని వెల్లడించారు. ఈ విషయమై ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ వివరణ కోరగా శ్వేత ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేసుకున్నదనే వార్త వాస్తవం కాదన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

- తిరుపతికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల
- 4.8 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ.35 వేల నగదు అపహరణ

గీసుకొండ: వరంగల్ జిల్లా సంఘం మండల శివారు స్టేషన్ చింతలపల్లికి చెందిన జవ్వాజి హేమలత తన కుటుంబ సభ్యులతో కలిసి గత డిసెంబర్ 30న ఇంటికి తాళం వేసి తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. స్వామివారి దర్శనం అనంతరం శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటిలోని 4.8 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి, రూ.35 వేల నగదు, ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ఇంటికి తిరిగి వచ్చేలోగా ఊడ్చేశారు!

- రూ.4.80 లక్షల నగదు, 20 తులాల బంగారం చోరీ

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం విజయనగర్ నగర్‌కాలనీకి చెందిన సయ్యద్ ఖాజా ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.4.80 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. సయ్యద్ ఖాజా నాలుగురోజుల క్రితం నయీంనగర్‌లో తనకున్న మరో ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి, బీరువా ధ్వంసమై ఉంది. రూ.4.80 లక్షలతో పాటు బంగారు ఆభరణాలు కనిపించలేదు. సమాచారం అందుకున్న ఎస్సై రవీందర్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వేలిముద్రలు సేకరించి పోలీసు జాగిలాలతో గాలించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద


రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్య శారద, తదితరులు

ఖిలా వరంగల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీఓ జి.లక్ష్మి ఆధ్వర్యంలో ఎంవీఐలు జైపాల్ రెడ్డి, శోభన్‌కుమార్ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరమన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపి ప్రమాదాలు తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పాత్రికేయుల సహకారం అవసరం

వరంగల్: జిల్లా సమగ్రాభివృద్ధిలో పాత్రికేయుల సహకారం అవసరమని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాత్రికేయులు, ఉద్యోగులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రజల సమస్యలను పాత్రికేయులు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీపీఆర్వో ఎండీ.అయూబ్ అలీ, ఏపీఆర్వో ప్రేమలత, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలి

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ శంకుస్థాపన ఏర్పాట్లను పూర్తిచేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఈనెల 5న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రూ.3.50 కోట్లతో సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ మొగిలిచర్లలో ఏర్పాట్లను పరిశీలించారు. శంకుస్థాపన, సభాస్థలి పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అదే విధంగా గీసుకొండలో రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో బాలురు, బాలికల పోటీల పనులను కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్రంలోని పది పూర్వ ఉమ్మడి జిల్లాల నుంచి ఖోఖో క్రీడాకారులు పోటీల్లో పాల్గొననుండగా వారి కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, డీఈ జాటోత్ హర్షి, డీఈఓ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, హెచ్ఎం పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం మోటార్ల టెస్ట్ రన్ ప్రారంభం


మహదేవపూర్‌లో ఎర్రచెరువును పరిశీలిస్తున్న నీటి పారుదల అధికారులు

కాళేశ్వరం: జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం మెట్‌పల్లి పంచాయతీ పరిధి బీరాసాగర్ వద్ద నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా పంపుహౌస్‌లో మోటార్ల టెస్ట్ రన్‌ను ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా కాటారం మండలంలోని గూడూరు పెద్ద చెరువు, మహదేవపూర్ మండలంలోని ఎర్ర చెరువులను పరిశీలించారు. సీఈ సుధాకర్ రెడ్డితో కలిసి పంపుహౌస్‌లోని మోటార్ల టెస్ట్ రన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ సలహాదారు పెంటారెడ్డి నిర్వహించారు. మోటార్లకు విద్యుత్ సరఫరా అందుతోందా, మోటార్లలో ఏమైన ఎలక్ట్రికల్ సమస్యలు ఉన్నాయా, లో ఓల్టేజీ సమస్యలు తలెత్తే అవకాశం ఉందా అనే కోణంలో పరిశీలించారు. నిత్యం దశలవారీగా టెస్ట్ రన్‌లు చేసి డ్రై రన్ నిర్వహించనున్నట్లు తెలిసింది. వారి వెంట ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్ రెడ్డి, ఈఈ యాదగిరి పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టర్ బంగ్లా పరిశీలన


బంగ్లాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, అధికారులు

హన్మకొండ అర్బన్: నగరంలోని సుబేదారిలో గల పాత కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను ఎమ్మెల్యే, అధికారులు పరిశీలించారు. పాత కలెక్టర్ క్యాంప్ కార్యాలయ భవనాన్ని మరమ్మతు పనులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఉన్న అవకాశాలను అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే వెంట 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.